# గంగిరేగి చెట్టు

శ్రీమతి డా॥ పి. యశోదా రెడ్డి

ఎచ్చమ్మ తల్లి పురుట్లనె కాలం జేసింది. ఆ పిల్ల పుట్టింది మూల నక్షత్రం. ఇగ ఆ నక్షత్రబలం కొద్ది కావల్సిన పని అయింది. ఈ పిల్ల పుట్టి నా లక్ష్మిని దిగమింగెనని తండ్రి కాశిరెడ్డి పిల్లను జూస్తె సీములు జెర్లు వాకినట్లు సీదరిచ్చుకుంటుండె. పాపం ఆ పిల్లకు యాళ్లపాళ్ల నూసెటోళ్లు లేకపోతె, ఆ పిల్లను గొంచబోయి రుక్కుణమ్మ పెంచుకున్నది. ఆ పిల్ల పాలమూర్ల పెరిగింది.

కాశిరెడ్డి ఉక్కు కడ్డి అసుంటి మనిషి. నడుస్తుంటె బూమి నాదిచ్చేది. పల్క పెయ్యి, బారెడు ఎద, కోసు కండ్లు పొడ సక్కని మనిషి. యశోదకు వొంకుల ఎంటికలు దప్ప అంతా తండ్రి పోవడే. తండ్రి నోట్ల దుసి పడ్డట్లుంటది. బిడ్డ దిక్కు మనసు రాయి జేసుకున్న కాశిరెడ్డికి ఎప్పుడో కలల భక్షాలు దిన్నట్లు బిడ్డ కండ్లల్ల వడితే, రాయి వారిన మనసు ఎన్న ముద్దోలె అయ్యేది. అడప దడప పేష్‌లకని, మొకద్దమల కని పాలమూరి కొచ్చినపుడల్లా బిడ్డను జూసి పోయెటోడు. అప్పుడు తనను బిల్సుకపోనీకె వచ్చిన జతగాండ్లను జూసి 'అబ్బ, మా నాయి నొచ్చిండు. ఈయాళ్ల, గాజప్ప లాట ఆడను, పొద్దుమూకి గూడ ఎన్నలకుప్ప లాటకు ఉద్దిని ఎవర్నన్న ఏరుకోండి' అని ఇంటి కెవరో కావల్సిన సుట్టపాయన వచ్చినట్లు చెప్పేది. ఎప్పటి తీర్గనే ఈ త్యాప గూడ కాశన్న పాలమూరి కొచ్చిండు. ఎచ్చమ్మ కిప్పుడు తొమ్మిదేండ్లు. ఎప్పటి తీర్గ కాకుండ, ఈసారి తండ్రొచ్చి స్తానం జేసి రాంగనే అద్దం, బొట్టు పుల్ల, కుంకుమ తెచ్చి ఇచ్చింది. తండ్రి అద్దంల నామం దిద్దుకుంటుంటే, ఎన్కనుండి వచ్చి 'నాయనా!' అని బుజాలు పట్టుకొని యాళ్లాడింది. తన మొకం పక్కకు బిడ్డ మొకం అచ్చం చిన్న కాశన్నోలె అద్దంల గానొచ్చింది. అది జూసి తండ్రి కడుపుల సేయి వెట్టి తిప్పినట్లైంది. అమాంతం సేతులు మల్సి బుజాల మీది బిడ్డను గుంజుకొని తొడ మీదేసుకొని 'ఎచ్చలూ! నా కన్నలూ!' అనుకుంట ముద్దిచ్చు కున్నడు.

ఎచ్చమ్మ తల్లి సరస్వతమ్మ తద్దినం పుష్య మాసంలనే వస్తది. సంక్రాతి పండుగ ఆనాటికి రొండు దినాలు అటో ఇటో ఉంటది. ఇగ సంకురాత్రి నెల నిలవెట్టంగనే చెల్లెలు ముత్యాలమ్మ, మ్యానల్లుడు రఘునాథరెడ్డి, ఊళ్ల ఉన్న అల్లుడు ఎంకటెడ్డి అంతా ఆ యింట్ల జేరుకునెటోళ్లు. ఈ దినాలల్లనే పిల్లను ఎంటవెట్టుకొని పాలమూరి నుండి రుక్కుణమ్మ గూడ బిజిన పల్లెకు వస్తుండె బిజిన పల్లెకు వచ్చినపుడల్ల ముత్యాలమ్మ అన్నను జూసి 'అన్నా! తల్లిగారింటి సమందం తెగదెంపులు జేయకు. మా యత్తగారింట్ల నా మాట నెగ్గటందుకు నా తల్లిగారి బలం ఉండాలె, అందుకోసం నీ పిల్లలల్ల ఓ దాన్ని నా కొడుక్కు ఇయ్యరాదా! నీ పిల్ల మా ఇంట్ల పడ్తె యాడాది కోనాడు సీరె, సారె, ఒడిబియ్యాలె గాకుండ, మన పిల్లల సమందాలు జూస్కొని రొండు ఇండ్లోండ్లకు రాకపోకలు నడుస్తవి. మీ బావ బిజ్జి కొంచెం దగ్గతది' అని పీడిచ్చుక తింటుండె. ఆ పోరు పడలేక కాశిరెడ్డి 'నీ పొట్కు ఎక్కునైందే ముత్తెం, సరె నీలి నిస్తలే' అని మాటిచ్చిండు. కాని మొన్న పాలమూరికి పొయ్యి వచ్చినప్పటినుండి ఏశోదనే కాశన్న కండ్లల్ల మెదలవట్టింది. 'అరే, మా ముత్యాల కొడ్కు రాగనికి ఎచ్చమ్మను ఇయ్యాలె. నీలికి ఇంకో

కాడ గట్టి జేస్త'నని అనుకున్నాడు. అనుకున్నోడు అనుకున్నట్లె పెద్ద గుఱ్ఱాన్ని ఎక్కి చెన్నారం పయినమై చెల్లెలు ముత్యాలమ్మ ఇంటికి వోయిండు.

ఎన్నడూ పిల్సి రాని అన్న పెద్ద గుఱ్ఱాన్నెక్కి పక్కడు, పక్కడు మనుకుంట వోపి ఇంటి కమాన్ ముందల దిగంగనే రంతు గుర్తువట్టి ముత్యాలమ్మ దబదబ పాలుకులకు నడ్సుకుంటొచ్చి, 'ఏందే అన్న, అంత బాగేనా?' అని అడిగింది. 'అంత బాగే ముత్యాలు. బావేడి? ఇంట్లకు పద. నీకో మాట జెప్పి పోవాలెనని వొచ్చిన' అని మాట్లాడుకుంట అన్నా చెల్లెండ్లిద్దరు భవంతిలకు వోయి కూసున్నరు. చెల్నెల్ని జూసి కాశి రెడ్డి 'సూడు ముత్యాలు, మొన్న త్యాప మనం అనుకున్నట్లు నీ కొడుక్కు నీలిని గాదు, తల్లిలేని పిల్ల ఎచ్చల్ను ఇస్త! ఇంతకు నీవెంత నోసుకున్నవో గని, నీ పూల పుట్కల వడ్డవనుకో' అన్నడు. అన్న మాట విన్న ముత్యాలమ్మకు ఏమనాల్నో తెల్వలేదు. కొంచెం తటపటాయించింది. 'మూలనక్షత్రం అని మూణ్ణెల్ల పిల్లప్పుడు తల్లి లేని పిల్లను ఎవ్వరు ఒల్లమంటె ఒల్లం అన్నప్పుడు, మనుసు ఇర్గిన అన్ననే రుక్కుణమ్మకు సాక్కమని ఇచ్చె గద! మరి ఇయాళ్ల ఆ పిల్లను అన్నెట్ల దెస్తడు. ఆమెట్ల ఇస్తది? ఇస్తె మట్కు నేనెట్ల జేసుకుంట? వాళ్లెవరు? నేనెవరు?' అని రెప్పపాటుసేపు ఆలోచన చేసింది, 'ఇంతట్లనె తేరుకొని ఏనుగంత అన్న ఉండంగ నాకేం బయం. ఆ పోరి నా అన్న నెత్తురు కండ గాకుంటె మంది పిల్లనా? మా అన్న కాశన్న మాటకు ఎదురు వలికే నాదుడు ఎవరుండరూ అంట. సూర్యుడు తనోడైతె సుక్కలన్ని తన కుక్కలంట. ఊరికైన మనిషి. మాలీ, పోలీస్ వతన్ల సేతులున్న అన్నముంగలి కడుమ సుట్టాలందరు కుక్కిన పేండ్లే గద. దేవుని దయ ఎట్లుందోగని, ఏశి పుట్టినకాణ్ణుంచి నా కన్నంత దాని మీదనే ఉండె. మా దొర బయానికి కుయిక్కు మన లేదు గని, ఆనాడె పిల్లను దీస్కపోక పోయినాను. మా రాగనికి ఈడూ జోడు, ముద్దుగుంటది. సీపిరి కండ్లనీలి కాటికకండ్ల ఏశి మీద దిగదుడ్సుకన్న పనికి రాదు' అని అనుకొని 'అన్నా! నీ మాట ఎన్నడన్న కాదన్ననా? ఈ మాట మా బావ చెవుల నిదానంగ ఏస్త. బరువు బారాలన్ని నీవే. మాట మట్కు ఖాయం' అన్నది.

ఈసారి నెల్లాళ్ల ముందే ముత్యాలమ్మ తల్లిగారి ఊరికి పయినం గట్టి అన్నింట్ల పీట వెట్టింది. ఆడివిల్ల నెల్లాళ్ల వచ్చి తనింట్ల గూసున్కం ఆవ గింజంత ఇష్టంలేదు వొదినె కిష్టమ్మకు. ఇన్నాళ్ల ఆడివిల్ల ఇంటి కొచ్చిందంటె కిష్టమ్మ ఇగలేని బయంతోటి పైనీడ కండ్లు పెట్టుకోని మెలిగేది. ఈ త్యాప 'మాకూ తల్లిగారిండ్లున్నవి గాని, గిన్నివైనా ఎరుగం తల్లీ! ఈ ముక్కుమీది కోపాలతోటి ఎవ రేగుతరు' అని రుసరుస లాడ్కం మొదలు వెట్టింది. ముత్యాలమ్మ భోజనానికి రాక తొలిగినె కంచుట్ల కోడికూర సగం దీసి గుండుగిన్నెలేసి ఉట్టిమీద ఎక్కిచ్చేది. షష్టివారాలు దీరి నెల్లాళ్ల గడ్సినా 'అమ్మో! ఎంకీనెయ్యి గెలుక కుండి అంట్లైత'వని దుత్తకు దుత్త పెద్ద గోవెంల దాసేది. ఇగ పాల దాయి కాడ, సల్లిపెర్పుకాడ, కట్టుకావ లుండేది. పిల్లకల్లు రాంగనె సన్నుబుడ్డెడు ముందే దీస్కొని 'సంటిది కమిలి'కని చెప్పుతుండె. ఇవన్ని జూసి అరికాలిమంట నెత్తికెక్కిన గని ఉగ్రాన్ని దిగి మింగుకొని, 'ఉట్టె ఎన్నాళ్లాగుతది, ఊగని, ఊగి ఊగి ఉన్న కాడ్కె వస్తది' అని తమాయించుకొని అన్న చెవుల వడకుండనే నడుపు కొచ్చింది.

ఇంతట్ల పాలమూరి కెళ్లి ఎచ్చమ్మ రానే వచ్చింది. ఉంగురాలు దిరిగిన ఎంటికలు కండ్లమీద గుత్తులోలె వాల్తుంటె పొట్టి జడేసుకొని, ఒంటి ముత్యం ఊగులాడె కిలావర్ పూలు చెవులకు, మెళ్లకు ఎఱ్ఱరాళ్ల పత్కంల గలిపి గుచ్చిన గోధుమాణి దండేసుకొని, కిలకిల మనుకుంటొచ్చింది. ఈ పిల్ల రాంగనే ఇల్లు పచ్చతోరణాలు గట్టినట్లు, బంతిపూలు పూసినట్లు, ఎన్నెల గాసినట్లు కళకళ లాడింది. పిల్ల నిజానికి సక్కని చెక్కడపు బొమ్మకాదు. అయినా ఆ పిల్ల ముకం, కళ ఏదోగని, ఒక్కసారి జూస్తె మళ్లా మళ్ల సూడ బుద్ధైతది. అది నగినప్పుడు

కుడిదిక్కు సొట్టలు పడ్డ దాని పాల చెంపలు ముద్దులు గుమ్మరించ బుద్దైతవి.

బిజిన పల్లెల ఎచ్చమ్మ వాళ్లిల్లు కంచెంత పెద్దది. లంకసొంటి ఆ పాత కొంపల మొన్న మొన్ననె వాళ్ల నాయిన దక్షిణపు దిక్కు బంకులు భవంతి లేపిండు. ఈ కొత్త భవంతి కచ్చేరి అయింది మొగోళ్లకు. ఆడ మూడుపొద్దులు అందరు జేరి ఊరిమీది ముచ్చట్లు, న్యాయాలు, తీర్పులు జర్పుకుంట ఉంటరు. అందుకోసం ఆ దిక్కుకు పిల్లలు, ఆడోళ్లెవ్వరు వోరు. ఈ కొత్త బంకులకు పాతింటికి నడుమ ప్రారీవెట్టిన ఉత్తసోటుంది. ఆణ్నే పెద్ద సేదు బాయుంది. ఇంటికొచ్చిన సుట్టపక్కాలు, మొగోళ్లు ఈడ్నే స్తానాలు జేస్తరు. దాని కానిచ్చి ఏసిన సః పం లనే వొడ్ల దంపుకం, అట్కులు గొట్కం, గిట్ట జర్గుతవి. అవుతల పెద్ద పెరడుండది. ఈ ఉత్తసోటుకు, ఆవల పెరటికి నడుంగలో దిడ్డి తలుపుండది. ఈ దిడ్డితలుపు దాటే ఆడున్న కొట్టాలు, గడ్డాములు గండ్ల వడ్తవి. ఈడ రొండుమూడు యాప, చింత, తుమ్మ, మామిడి చెట్లున్నవి. ఇవన్నిటికన్న సెప్ప దగ్గది ఓ రేగిచెట్టొకటుండేది. ఇవన్ని ఒగెత్తు ఇగ ఆడున్న రేగిసెట్టు ఒగెత్తు. ఎన్ని సెట్లుంటె ఏంది, రేగిసెట్టుకున్న ఖదరు, ఆడ యా సెట్టుకు లేదు. ఎందుకంటె ఆ నెలల పిల్లలకు గావల్సిన పండ్లిచ్చేది గా చెట్టొకటే. ఐతే పిల్లలనోట్ల గడ్డ గొట్టినట్లు ఆడ్కిపోకుండ, ఆదిడ్డి దరువాజ మూస చిక్కు తాలం తగిల్చిన్రు. ఎందుకంటె పెరట్ల పాతగోడ వెన్కున్న పెద్దబాయిల మొన్నమొన్ననే కర్ణపు రవుణమ్మ కోడలు చిన్నతాయారమ్మ వడి, సచ్చి, దయ్యమైందట. ఇంగ అది ముందే బాపని దయ్యం, పడ్తే ఇడ్వదు. అదిగాక అభం శుభం దీరకలోట్టి ఉండె, ఇంగ అసుంటి దయ్యపుగాలి, గీలి పిలల్లలకు యాడ దాకుతదో అనే బుగులోట్టి ఆ దిడ్డి తల్పు దెర్యకమే లేదు. గుడ్లుర్మితె కండ్లు మూసుకునే పిల్లలు ఆ దిక్కు జూసుకుంట గుట్కెళ్లు మింగిమింగి చెట్టుమాటనే మర్శి ఊకున్నరు.

ఇంగిలీకం ఆ సొంటి ఏశివొచ్చినంక పిల్లలందరికి ఆటిడిపైంది. ఇంట్ల ఆడోళ్లు సకినాలు జుట్టుకుంట, అరిసెలపిండి గొట్టుకుంట, సొజ్జె ఇసురుకుంట, పేణీలకు శక్కెర జల్లుకుంట, పొలావ్ కొరకు కాకెరొడ్ల పొతం జేపిచ్చుకుంట, ఆ యీ పనులల్ల వడిపిల్లల మీది విగురాని కొంచెం సల్లిడిసిన్రు. ఇగ పిల్లలుగూడ ఏపుడు బియ్యం బెట్టు, చిట్టిలువలుబెట్టు, బెల్లప్పొసవెట్టు అని ఊకె తల్లుల ఎంటవడి ఏపుకం మానిన్రు. సిరిదిండ్ల మీన సింతమాని పల్కలు బల్పాలు వట్టుకొని ఒంట్లు, ఓనుమాను రాసుకుంటి సదువుకుంట దిర్గుతుండరు. ఇట్ల తీగె రాగాలు మాని నక్కుంట, ముర్సుకుంటున్న ఎడ పిల్లలను జూసి, తల్లినిడిస్తే పిల్లి గరుస్తదని తల్లిసంకకు అత్కపోయిన సంటి పిల్లలుగూడ దిగితప్పటడ్గులు ఏస్కం మొదలువెట్టిన్రు. ఎచ్చమ్మ సన్నసులు చేతుల వట్టుకోని పల్కమంచం ఎక్కి కూచోని పిల్లలకు పద్యాలు, అంగ్రీజు నెలల పేర్లు నోటికి యాది జేపిస్తుండది. పిల్లలందరికి ఎచ్చమ్మంటే గురి గుదిరింది. అప్పటికే పంజుయ్ జమాత్ చదువుతున్న రఘునాథరెడ్డికి తుర్కమే గని, అంగిరీజ్ రాదు. 'ఈ పోరి ఏశి మూతి గుండుగ వెట్టి అంగిరీజ్ సదువుతఃంటె పెద్ద లాట్ సాబ్ బిడ్డొలె ఉంది. మరి ఈ సదవు నా కొస్తె బాగుండు'ననుకున్నడు. 'అయితె గా పోర్ని ఎట్లడ్గి నేర్సుకోవాలె, నాకంటె సిన్న గుండి మిడ్కెగదా. నేర్సుకోకుంటె రేపు మా పటింతల మామ, 'అరె పిలగాండ్లు! మీరు నేర్సుకున్న కొత్త కొత్త పాఠాలు సదివి నాకు యినిపిచ్చుండి' అ- అడ్గితె ఏశి గీ అంగిరీజు సదువుతది. మరి నాకు రావంటె నెత్తిదించుకోవాల్సి వస్తది. అబ్బ, ఈ పోరి యాడ నేర్సిందో ఇవన్ని. ఎల్లిపాయ పటాకిరో నాయిన! ఎట్లైన ఉపాయం జేసి నేను అంగిరీజు నేర్చుకోవాలె' అని అనుకోని ఓ తంతు వన్నిండు. పిల్లల్నందర్ని పిల్సి కూసోవెట్టుకోని 'అరె తమీమ్మా, తమీమ్మా సెల్లే, బుచ్చి, బుచ్చి. ఇగ సూడుండి. మీరందరు అంగిరీజ్ నెలలపేర్లు తప్పు వోకుండ పది

సార్లు సదివితె, ఎండపూట మన ఊరెన్క రాగళ్లకెల్లి పచ్చిశెనక్కాయ దెచ్చిపెడ్త'నన్నడు. ఆ మాట ఇని పిల్లలు 'బావ, బావ, అన్న, ఇగో అప్పుడే గవి మాక్యా డొస్తది. అగో ఎచ్చక్క లేదు, పట్నంకెల్లి వొచ్చిన పుట్నం గింజ. దానికే వస్తవి. రాగన్న, గివిరావ్‌గని, నీవే పని జెప్తె అది జేస్తమ్. నీవు పెద్దబాయికి ఈత గొట్టబోతె బెండు మోసుకొస్తం. పాడి తువాల, బనీను వట్టుకోని నీ వచ్చేదాక బాయిగట్టుమీద దిరిసూసుకుంట గూసుంటం. నీవు పొద్దుమూకి పెండాడెటప్పుడు తప్పిపోయిసెండు యా కంప తీర్లల్ల వడ్డగని, ఉర్కిపోయి తెస్తం. శెనక్కాయ దెచ్చిపెట్టే' అని గివాలుకుంట అడిగిన్రు పాపం. ఇగ బావ, ఎచ్చమ్మను జూసి 'ఎచ్చా, నీవు సదువే సూతం' అని అడిగిండు. ఎచ్చలు నెత్తి అడ్డంగ దిప్పుకుంట 'నేను జదువను. అమ్మో! ఎంత ఉషా రున్నవ్. నేను పదిసార్లు సదివేట్యాళ్లకు నోటికి యాది జేస్తమను కున్నవ్. నా కెరుకే నీ ఉపాయం. అట్లె సదువత. గని బావీ, నాకు Jack & Jill, Lio the Lion ఇంగా ఎన్నో అంగ్లీజ్ పద్యాలు వొస్తవి. అవన్ని నీకు నేర్పు తగని, మరి నాకు మవ దొడ్డిలున్న గంగిరేగి వండ్లు తెంపియ్యవా?' అని అడిగింది. ఆ మాట ఇనంగనే బావ ఒక్కసారి ఉలిక్క పడిండుగని, కాదంటె ఆ పోరి ఇర్గవడివగుతది. 'అవును. ఇంట్లో సెట్టువెట్టుకొని ఇంత తండ్లాట ఎందుకు? నాకన్న ఈ పోరే నయం' అనుకొని 'సరె. ఏది నీవు దిడ్డికాడ కావలిగాయి. నేను గోడదుంకి తెస్త'నన్నడు. గని అప్పటికి అడ్నే మణుసులు మెసుల్తంటె అనుము దొర్కక, తెనుగు రంగడు దెచ్చిన చెరుకుగడలు చేతుల వట్టుకొని, పిట్టగోడెక్కి కూసోని కాళ్లూపుకుంట సదువుతుంటె, ఎన్క బావ సదువుతున్నడు. ఇది జూసి పిల్లలంత ఉరుక్కుంట పోయి ఇంట్ల జొరవడి 'అత్తా! అత్త, ఇగొ ఎచ్చక్క తోటి అంగ్రీజ్ నేర్సుకుంటుండడు. అక్క పంతులమ్మైంది. సూతువు రా' అని పిల్సు కుంట గుంజిన్రు. కొడ్కు అంగ్రీజ్ నేరుస్తడంటె ఎంతో సంబరం అయింది, 'అవును. రేపు మావోడు తాలుక్దారయ్యేటో'డనుకొని ఉబ్బిపోయింది. గని, 'అంతకొడుక్కు ఏలంతపోరి, రేపు వాణి అదుపాజ్ఞల మసిలే పోరి గురువోలె నేర్పుతుండదంటె ఎంత సిన్నతనం!' అనుకొని 'ఎవతే ఆ మాట అంటున్నది? మీ ఎచ్చక్క లొచ్చక్క నేర్పితే గని, బావ దొరకు దెల్లారదు. పోనియ్యరు సత్తిబింకాలు, అవుతలికి వదుస్తరా, లేదా!' అంట ఎల గొట్టింది.

మర్నాడు పిల్లలెవ్వరు లేకుండజూసి అందరి కండ్లుగప్పి ఎచ్చమ్మ, బావ ఇద్దరు గలిసి ఇంటెన్క గోడమీదికెల్లి దుంకి, పెరట్ల జొరవడి, గడ్డివాముల పాటుకెల్లి రేగిచెట్టుకాడికి పోయిన్రు. చెట్టు ఇరగ్గా సింది. కసరు పిందెలు, జోరుపండ్లు, బాగా దొర మాగిన పండ్లు ఎన్నెన్నో ఉన్నవి. చెట్టునిండు గజ్జిగాపివట్లుంది. గని, గడలతోటె, సువ్వలతోటి గొడ్తె కసరుకాయలు రాల్తవి. కమ్మలకత్తి దెచ్చె టట్లు లేదు. అందుకోసం చెట్టెక్కాలె. బావ ఎక్కితె కింద ఎచ్చి ఒక్కతె ఉంటది. పక్కకు దయ్య ముండది. అందికే ఇద్దరు చెట్టెక్కాలె. మరి ఏశికి కాళ్లందవు. ఎట్లా మరి?

'నాకేం బయం లేదు. బావ, నీ వెక్కు'

'వద్దు ఏశి.'

'మరెట్ల బావ? నీవేమొ సెట్టు వాకి ఎక్కుతవు. ఈ కొత్త పర్కిణి ఎగవాకేటప్పుడు సిన్గితె ఎట్ల?' అన్నది. బావకు నిజమే అనిపిచ్చింది. 'అయితే ఎచ్చి, నేను రాళ్లు వోగువెడ్త. ఈ రాతి మీదికెల్లి నామీద వో కాలువెట్టి నీవు చెట్టు మొదట వోకాలు వెట్టు. అటెంక కొమ్మ దొర్క వట్టుకొని, చెట్టు మొదలు పంగలల్ల నాకు సోటుంచి గూసో. ఇంగ నేనెక్కి వస్త' అన్నడు.

ఏశికి బావ ఎంత మంచోడని పిచ్చింది. బావను పట్టుకొని ఏశి ఎక్కింది. బావ ఎక్కిండు. కావల్సి నన్ని పండ్లు సిల్క గొర్కినవి, వొలాయించి ఏరు కొని తిన్నరు. తెంపుకోని కీసలు నింపుకున్నరు. సాలైనవి. ఇంగ బావ కిందికి దుంకిండు: పాపం ఏశికి

దిగొస్తలేదు. పట్కా జారుదమంటె సెట్టు గీస్క పోతుండది. ఇంతట్లనె మెరుపు మెర్శినట్లు రఘునాథ రెడ్డికో ఆలోచనొచ్చింది. దబదబ చెట్టు దిగి నోడల్ల, చెట్టు కింది బండి ఎక్కి వొంగిండు.

'ఎచ్చి, బయపడకు, చెట్టు దిక్కు మొకం జేయి, ఎడమ మోకాలొంచి చెట్టు కానిచ్చి నిలవడు. మెల్లగ ఆ కాలు నా ఈపుమీద మోపుకుంట దిగు' అన్నడు. బావ జెప్పినట్లె ఎచ్చమ్మ ఆవలి మొకం జేసి రెండు సేతుల చెట్టును గట్టిగ పట్టుకొని మెల్లగ దిగుతుండది.

ఇంతట్లనె బోజనాలకు పొద్దైంది. 'సోటు జేసి శానసేపాయె. అన్న గూడొచ్చి 'వడ్డనైందీ' అని అడ్గవట్టె. ఆయనకు వడ్డన సేతమంటె, పనివడి 'మా రాగయ్య యాడుండ'డని అడిగిండు. పిల్లగాడు కండ్ల వడకుంటె అన్నే మనుకుంటడు? తులవ పోరలల్ల గలిసి ఇల్లు పట్టకుండైండని అనుకుంటడేమొ! ఎట్లజెతబ్బా' అని బిరబిర ఇవుతలికొచ్చి జూస్తె యాడ లేదు. ఇంతట్లనె రాత్రి పూటకు యాటను పాతం జేస్తనని కటికో డొచ్చిండు. 'దిడ్డిదెర్శి వొస్త' నని దిడ్డి దరువాజ దెరిసె ట్యాళ్లకు కొడ్కు వొంగిండు. వాణి సల్య అంగిమీద ఏశి కాళ్లు బెట్టి దిగుతుండది. 'వాయబ్బ, ఎంత పనాయె! పోయి పోయి అదునా కటికోని కండ్లల్ల వడె గదబ్బ! అమ్మో, పోరి తిప్పితిప్పి కొడ్త, పదేండ్లు లేదు. ఇప్పుడే వాణ్ణి కత్తెకుక్కను జేసి తిప్పుతుండది. తల్లీ, నయం. కండ్లు దెర్శిన. కానక కంపల వడ్తుంటి. ఈ పోరికో దండం, ఈ సంబంధానికో దండం' అని బిర బిర వోయి 'రాగా, ఏం జేస్తుండవురా' చెవ్వువట్టి గొరగొర గుంజుకొచ్చింది. అట్లొచ్చి దివాను పీట మీద గూసున్న అన్నను జూసి 'అన్నా' సాలు. నీ ఇంటికి వచ్చినందుకు మర్యాద బాగనె జేసినవ్. తల్లిగారింటికి వెయ్యి దండాలు. ఇన్నాళ్లనుండి కడ్పు చించుకుంటె కాళ్లమీద పడ్తదని, కడ్పుల పెట్టు కొని ఊకె ఉన్న. నీ పెండ్లాం అన్న సూటిపోటి మాటలన్ని భరిచ్చిన. ఇగ నన్ను, నా పిల్లగాణ్ణి నీ పిల్లకంట్ల కనుపాపోలె దిర్గమంటె మా శాత గాదు. నాకు మీ సమందమే వద్దు. నవారి కచ్చరం గట్టెయ్యి. నేను పోతా'నని పయినమైంది. 'రాజీ నాకు ఆకలి లేదు. వడ్డన జేయకుండి. రుక్కుణమ్మను పిల్లను దోల్కొని రేపే పొమ్మనిజెప్పు' అనుకుంట కాశిరెడ్డి అవుతలికి నడ్సిండు.

---

